


# గల్లంతు

సి.హెచ్. నాగార్జున శర్మ

సమయం పన్నెండు గంటలవడంతో నేను నా కొలీగ్స్ రవి, కిరణ్‌లతో పాటు లంచ్ చేయడానికి మా ఆఫీసు క్యాంటీన్ వైపు దారి తీశాను. క్యాంటీన్‌లో సర్వు చేయడానికి సర్వర్లు ఎక్కువగా లేరు. సెల్ఫ్ సర్వీస్! దానికి తోడు క్యాంటీన్ ఫర్నీచర్ కూడా అంతంత మాత్రమే. దాదాపు రెండు వందల మందికి పైగా అక్కడ భోజనం చేస్తారు ప్రతి రోజూ. క్యాంటీన్‌లో ఉన్న ఫర్నీచర్‌కి తగ్గట్టుగా భోజనం చేసే పద్ధతిని మూడు బ్యాచ్‌లుగా పెట్టారు.

నేను ఇంటి నుండే క్యారియర్ తీసుకు వెడతాను ఆఫీసుకి. క్యాంటీన్‌లో నా కొలీగ్స్‌తో పాటు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేస్తున్నాం. ఇంతలో మేము భోజనం చేస్తున్న టేబుల్ దగ్గరకు మా కొలీగ్ ప్రసాద్ ప్లేటు రైస్‌తో పాటు ఎక్స్‌ట్రా రైస్ కూడా తెచ్చుకున్నాడు. ప్లేటు రైస్ అయిపోయింది. "నా ఎక్స్‌ట్రా రైస్ ఎక్కడ గురూ!" అని తన ప్రక్కనే ఉన్న రవిని అడిగాడు.

"నీ ఎక్స్‌ట్రా రైస్ నేను తీసుకున్నాను గానీ నువ్వు ఇంకొకటి తెచ్చుకోపో" అన్నాడు క్యాజువల్‌గా.


"సరే తప్పుతుందా గురూ!" అని ఎక్స్‌ట్రా రైస్ తెచ్చుకోవడానికి వెళ్ళాడు.

అతను లేచి వెళ్ళాడు. లేదో అతను కూర్చున్న కుర్చీని కాస్తా మరొకడు లాక్కుపోవడం, అతని ప్లేటేమో క్యాంటీన్ బాయ్ తీసివేయడం యాంత్రికంగా జరిగిపోయింది. ఈ సంఘటన నాకు తప్ప మా కొలిగ్స్‌కి ఎవరికీ తెలియదు. ఇంతలో ఎక్స్‌ట్రా రైస్‌తో వచ్చాడు ప్రసాద్. వచ్చి రావడంతోటే "గురూ! నా కుర్చీ, నా ప్లేటెక్కడ?" అని.

"నువ్వు ఎక్స్‌ట్రా రైస్ తెచ్చుకోవటానికి అటు వెళ్ళావో లేదో నీ కుర్చీనికాస్తా మరొకడు లాక్కుపోయాడు. మరి ప్లేటేమో క్యాంటీన్ బాయ్ తీసివేశాడు. ఇక పోతే నీ మంచి నీళ్ళ గ్లాసు మాత్రం నా దగ్గరుందని" అన్నాను.

"ఏమిటో మరీ ఈ క్యాంటీన్‌లో మనిషి కనబడక పోతే చాలు అన్నీ గల్లంతయి పోయేట్టున్నాయి బాబూ" అని వాపోయాడు ప్రసాదు.

"అలస్యం అమృతం విషం అన్నట్టు అలస్యంగా వస్తే అన్నీ గల్లంతయి పోతాయి మరి" అన్నాడు రవి ప్రసాదుతో. ●



కె. విజయకుమార్

# అపార్ట్‌మెంట్స్

తెల్లవారితే నేను ఒక ఉద్యోగం కోసం వ్రాత పరీక్ష వ్రాయవలసి ఉంది. ముందు రోజు సాయంత్రమే నా సరంజామాతో చిరకాల మిత్రుడు చంద్రం ఇంటికెళ్ళాను. ఇంట్లో వాడు లేకపోయినా వారు నన్ను అప్యాయంగా పలుకరించి, నా కో గది కేటాయించి పరీక్ష కోసం చదువుకోవటానికి అన్ని సౌకర్యాలు కల్పించారు.

అది దాదాపు వంద ఇళ్ళు ఉన్న నాలుగు అంతస్తుల అపార్టుమెంట్స్ - గాఢ నిద్రలో ఎక్కడో కేకలు వినిపించి ఉలిక్కిపడి లేచాను. - కళ్ళు నులుముకుంటూ చుట్టూ పరిశీలనగా చూశాను - మసగ్గా బెడ్‌లైటు మాత్రం వెలుగుతున్నది.

నే నున్న ప్రక్క గదిలో ఎవరో ఏడుస్తున్నట్టు గమనించాను. అటుగా వెళ్ళి చూశాను. చంద్రం వాళ్ళమ్మగారికి పక్షవాతం రావడంతో రెండు చేతులూ పడిపోయాయి. నోరు వంకరగా పోతున్నది. ఆ మేడుస్తూ భయంతో ఏవో సైగలు చేస్తున్నది. ఆమె చుట్టూ వారిద్దరి కూతుళ్ళు, వారి పెద్దబ్బాయి కూర్చున్నారు. భర్త ఆమె తలను ఒడిలో పెట్టుకొని ప్రథమ చికిత్స కోసం ఏవో అయింట్‌మెంట్స్ రాస్తున్నారు.

సమయం రాత్రి ఒంటి గంట అయింది. వెంటనే వారబ్బాయిని తీసుకొని, ఆ చుట్టు ప్రక్కల ఉన్న ఒకరిద్దరు డాక్టర్ల ఉన్న ఇంటి తలుపులు తట్టాను. బహుశా దొంగల భయంతో కాబోలు ఎవరూ తలుపులు తీయడానికి సాహసించలేదు. చివరకు ఒక డాక్టరు బయటకు వచ్చి మాట్లాడాడు.

చంద్రం డాక్టరుతో వాళ్ళమ్మగారి అనారోగ్య లక్షణాలను వివరించాడు. "ఇది చాలా సీరియస్, మీరు వెంటనే పెద్దాసుపత్రిలో స్పెషలిస్టును కలవండి" అంటూ డాక్టర్ సలహా ఇచ్చాడు. రిక్షా తీసుకొని ఆమెను ఆసుపత్రిలో చేర్పేసరికి ఉదయం అయిదు గంటలయింది. సకాలంలో చికిత్స చేయడం వలన ప్రాణాపాయం తప్పింది.

అర్థరాత్రి నుంచి తెల్లారే వరకు ఇంత తతంగం జరిగినా చుట్టు ప్రక్కల కాపురాల వారు ఏమీ పట్టించుకో లేదు. అక్కడి ఇళ్ళులాగే వారు కూడా ఒకరి విషయాలు ఒకరు పట్టించుకోకుండా విడి విడిగా ఉంటారేమో అనిపించింది. బహుశా తెలిసీ మనకెందుకని ఊరుకున్నారేమో!

చీమ చిటుక్కుమన్నా ఊరంతా ఒకటై అప్పటి వరకూ తమలో ఉన్న ఈర్ష్యా ద్వేషాలను ప్రక్కన పెట్టి ఆపదలో సహాయపడే మా పల్లె ప్రజలకూ, మనుషులంటే కేవలం రక్తమాంసాలుగా గుర్తిస్తూ, యాంత్రిక జీవితానికి అలవాటు పడి మానవతా విలువలు లేకుండా పోయిన ఈ పట్టణ వాసులకూ ఎంత లేడా....?

ఇలా ఆలోచిస్తూ ఇంటికి బయలు దేరాను - ఈ తతంగంలో నా వ్రాత పరీక్ష సరిగ్గా రాయలేక పోయాను. రాని ఉద్యోగం కోసం ప్రయాసపడి రాసే పరీక్షకన్నా ఒకరికి ప్రాణాపాయ స్థితిలో సహాయం చేశాననే తృప్తి నాలో మిగిలింది. ○